# కులట

(గల్పిక)

"నీభార్య మహాపతివ్రత అనుకుంటున్నావుగామాలు. నీ మొహం ఎరక్క-మునుపు అదినాదగ్గిరికి ముప్పైమూడుసార్లు వచ్చింది. కాదనమను."

సంతకం లేదు.

అతను సావధానంగా ఉత్తరం చించేసి దీర్ఘాలోచనలో పడ్డాడు.

ఇది ఎవడికీ జరగరాని అనుభవం. మామూలు మనిషి దీనికి తట్టుకోలేడు. పిచ్చివాడై పోతాడు. తను పిచ్చివాడై పోరాదు.

ఆ ఉత్తరంలో ఉన్నవిషయం నిజమేఅయి ఉండవచ్చు. నిజమనినమ్మే కర్తవ్యం ఆలోచించాలి.

అది రాసినవాడు తనమీది ప్రేమచేత రాయలేదు. తన భార్యమీదా తనమీదా కూడా పగతీర్చుకోనేటందుకు రాశాడు. అంతవరకూ తనూ తనభార్యా ఒకేపక్షం.

తను తనభార్యను చాలా గాఢంగా ప్రేమించాడు.

తనుఎరిగినంతలోఏభర్తాభార్యకివ్వనంతస్వేచ్ఛఇచ్చాడు.

అది దుర్వినియోగపరిచి ఆమె తన్నెప్పుడూ చులకనగా చూడలేదు.

ఆమె తనను ప్రేమించింది. ప్రేమించని మనిషి తనకేసి అట్లాచూడలేదు. సంవత్సరంనించీ కాపరంచేస్తున్నా తమ ప్రణయం మెరుపు మాయలేదు. తనమీద ప్రేమలేకపోతే

తను కనిపించగానే పుష్ప వికసించినట్టు ఎట్లా వికసిస్తుంది? తనని చూసుకుని అంత ఎందుకు గర్విస్తుంది?

తనూ అదివరకు—పెళ్ళికాకపూర్వం—తనకన్న నాలుగేళ్లు పెద్దదైన ఆడదాన్ని ఎరుగును. తను ప్రణయానుభవం పొంది ఉండటం లాభించింది.

తన భార్యకూడా అంతేనేమో!

ఈవిషయం తను భార్యతో చర్చించాలా, వద్దా?

తను ఏ చర్యా తీసుకోకపోతే ఆ ఉత్తరం రాసినవాడూరుకుంటాడా?

కులట అని దేశమంతా చాటుతాడు! కులటను పెట్టుకుని కాపరంచేస్తున్న అపఖ్యాతి భరించటం తనకు అసంభవం.

ఇటువంటి భార్య మరొకతె తనకు దొరకదు.

ఆ ఉత్తరం రాసినవాడి ఓర్చలేనితనానికి తను అనుభవించే శిక్ష—తను ఈభార్యను పోగొట్టుకోవటం.

అతనింటికిరాగానే తల దువ్వుకుంటున్న భార్య చేతులో, జడవిడిచేసి అతని కెదురొచ్చి గట్టిగా వాటేసుకుని మొహం పైకెత్తింది.

కొంచెం అనుమానించి అతనామెనుముద్దుపెట్టుకున్నాడు. ముద్దు రుచించలేదు. ఇక ఎప్పటికీ ఇంతేనేమో!

"అట్లా ఉన్నారేమండీ?" అన్నది అతనిచొక్కా పట్టుకుని పసిపిల్లల్లే లోపలికి నడుస్తూ.

గదిలో పందిరి పట్టెమంచం చూడగానే అతనునిలువునా నీరైపోయినాడు.

తనకేసి వింతగా చూస్తున్న భార్యను గాఢంగా—ధృత

రాష్ట్రుడు ఇనపభీముణ్ణి వాటేసుకున్నట్టు—వాటేసుకున్నాడు. ఆమెను పసిపిల్లను ఎత్తినట్టు రెండుచేతుల్లోనూఎత్తి మంచం మీదపడేసి తనమొహం ఆమెవక్షానికి గట్టిగా అదుముకున్నాడు...

ఆఉద్రేకపు ఉప్పెనతీరిపోగానే అతను మరో మనిషి అయినట్టయింది.

“రాత్రిబండికి మీవాళ్ళింటికి పంపేస్తున్నాను! త్వరగా వంటచెయ్యి” అన్నాడతను.

ఆమె తనకేసి చూస్తున్నదని అతనెరుగును. కాని ఆమె కేసి చూడలేకపోయినాడు.

ఆమె తనని ఎందుకనిగాని ఏమిటనిగాని అడగలేదు.

ఏమైనా సంశయం ఉంటే రూఢి అయిపోయింది.

“బండికి వేళౌతున్నది?” అన్నాడతను మరికొంతసేపటికి.

“ఇవాళవద్దు. రేపువెళతాను. తప్పక వెళతాను” అన్నదామె దీనంగా.

“నీయిష్టం! మరో వాయిదామాత్రం వెయ్యకు!”

తను భోంచేసి పడుకున్నాడు. ఆమె భోంచేసి వచ్చింది. కళ్లుమూసుకుని నిద్రపోతున్నట్టు నటించాడు. ఆమెవచ్చి తేలికగా తన పక్కమీద కూర్చున్నది.

గంట గడిచింది. ఆమె ఇంకా కూర్చునే ఉంది, ఏంచేస్తున్నది? తనకేసి చూస్తున్నదా? ఏంచూస్తుంది? తను మేలుకున్నట్టు తెలిసి ఇదోఎత్తు వేస్తున్నదా? కళ్లు తెరిచాడు.

ఆమె చప్పున మంచంమీదినుంచి లేచింది.

“ఏమిటి?” అన్నాడు.

ఆమె మళ్లీ అతనిపక్కనే కూర్చునే, "నన్నొకసారి కావిలించుకోండి. ఇందాకటల్లే!" అన్నది.

అతనిచేతుల్లో బలమే ఉన్నట్టులేదు.

అతనికి మూడింతలు బలంతో ఆమే అతన్ని కావలించుకున్నది.

"ఒక్కముద్దు పెట్టండి!"

ఆమెనోరు సన్నిపాతరోగి శరీరమల్లే కాలిపోతున్నది.

ఆమె భర్తను విడిచి ఎడంగాపోతూ, "లాభంలేదు. బతికున్నాళ్ళూ చెయ్యాలిసినపని ఒక్కక్షణంలో చెయ్యటం అసంభవం;" అన్నది.

అతని కర్థంకాలేదు.

ఇదంతా తనని మస్కా వెయ్యటం! అమ్మో, ఆడదానిఎత్తు!

పన్నెండు గంటలవేళ అతనికి కలతనిద్రపట్టింది. ఆమెమళ్లీ అతనికేసి చూడలేదు.

అతనికి తిరిగి మెళుకువచ్చేటప్పటికి ఎక్కడో కోడి కూస్తున్నది.

ఆమె పక్కమీద లేదు.

ఆమెకోసం గంటసేపు చూశాడు. రాలేదు.

అతనికి మళ్ళా నిద్ర పట్టింది.

మర్నాడుదయం బావిలో ఆమెశవం కనిపించింది.

———